సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 13 । జూలై । 2023



ఆధిక్యంలో నెల్లూరు, చిత్తూరు జట్లు

ఏసీఏ సౌత్‌జోన్ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు, చిత్తూరు జట్లు ఆధిక్యంలో ఉన్నాయి. -8లో



సహకార రంగం బలోపేతానికి చర్యలు

సహకారం రంగం బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ సుభాషిణి అన్నారు. -8లో..

గరిష్టం/కనిష్టం
34.4/27.5

వాతావరణం

జిల్లాలో బుధవారం 27.5 - 34.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 12.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

సేవకు సలాం

ఏళ్లకు ఏళ్ల పరిష్కారం కాని సమస్యకు
'జవాబు' వారు..
అర్హులు ఏ మూలనున్నా
దివిటీ పెట్టి చూస్తారు..

వారు కులం చూడరు..
వారికి మతం పట్టింపు అసలే ఉండదు..
ఇంటింటా తలుపు తట్టి
సంక్షేమాన్ని దోసిళ్లతో పోస్తారు..

వానొచ్చినా...వరద ఉప్పొంగినా..
కోవిడ్ కన్నెర్ర చేసినా..
వెన్నుచూపని 'స్వచ్ఛంద' సేవకులు వారు..
వారి సేవ చూసి ప్రకృతి చిన్నబోయింది..
కరోనా సైతం 'సలాం' చేసింది..



కోవిడ్ సమయంలో ప్రొద్దుటూరులోని కశెట్టి పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కూరగాయల స్టాల్ వద్ద విధులు నిర్వహిస్తున్న వలంటీర్లు

మానవత్వం చాటుకుని..



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జి. భారతి

చాపాడు: వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న వలంటీరు పేరు జి.భారతి. కేతవరానికి చెందిన కె.కొండారెడ్డి పక్షవాతంతో ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రి చికిత్స తీసుకున్నాడు. ఆ సమయంలో వలంటీర్ ఆస్పత్రికే వెళ్లి పింఛన్ అందజేసి మానవత్వాన్ని చాటుకుంది.

వలంటీరు లేకుంటే పింఛన్ ఆగేది..



మా ఇండ్ల వలంటీరు భారతి ఆసుపత్రికి వచ్చి మరీ నాకు పింఛన్ డబ్బులు అందజేసింది. లేకుంటే నా పింఛన్ ఆగేది. వలంటీర్ల వల్ల మంచి జరుగుతోంది. -కొండారెడ్డి, పింఛన్‌దారుడు, కేతవరం, చాపాడు మండలం.

బాబుకు గులాం

వందనాలందుకుంటున్న 'వలంటీర్ల' సేవలపై వక్ర భాష్యాలు పలికిన పవన్ మరోసారి చంద్రబాబుకు గులాం అనిపించుకున్నాడు. ఒంటి నిండా 'ప్యాకేజీ' మరకలు.. ముఖానికేసుకున్న పచ్చ' రంగులతో 'కొత్త' నటనకు తెరతీశాడు. దుష్ట చతుష్టయంలోఒకడై.. సంక్షేమాన్ని అడ్డుకోవడానికి సైంధవ పాత్ర పోషిస్తున్నాడు. 'బాబు' వేసిన స్క్రిప్ట్ మాయలో పడి .. వలంటీర్ల చేత ఛీత్కారాలు.. చెప్పుల సత్కారాలు అందుకుంటున్నాడు. బరిలోకొచ్చిన ప్రతీసారి ..రాజకీయాలు చేసే ధైర్యం లేక 'జీ హుజూర్' అంటూ బాబుకు గులాంగిరీ చేస్తున్నాడని వలంటీర్లు ధ్వజమెత్తారు. జిల్లాలో వరుసగా మూడో రోజూ వలంటీర్లు నిరసనలు తెలిపారు.



లింగాలలో పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

గాడిదపై పవన్ దిష్టిబొమ్మ ఊరేగింపు

లింగాల : వలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై లింగాల మండల వలంటీర్లు భగ్గుమన్నారు. మండలంలోని అన్ని గ్రామాల వలంటీర్లు లింగాల మండల కేంద్రానికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను గాడిదపై ఊరేగింపు నిర్వహించారు. అనంతరం బస్టాండు సమీపంలో పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వలంటీర్లకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. బాబురెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, జగనన్న సురక్ష మండల కన్వీనర్ నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కర్నా రమేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలు అర్థరహితం

ఖాజీపేట: వలంటీర్ల పనితీరుపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితం అని వాటిని ఎవ్వరూ సహించేది లేదని ఎపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. ఖాజీపేటలో పవన్ వాఖ్యలకు నిరసనగా ఎంపీడీఓ కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టారు. అనంతరం ఖాజీపేట బస్టాండ్ కూడలి వద్ద పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం

అట్లూరు: అట్లూరు క్రాస్‌రోడ్డులో వలంటీర్లు పవన్ కల్యాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలపై నిరసన

రాజుపాళెం: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్‌పై మండలంలోని కొర్రపాడు గ్రామ వలంటీర్లు బుధవారం నిరసన తెలిపారు.

పవన్‌ది తెలివి తక్కువతనం: ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : ప్రతి ఇంటికి సేవలు అందిస్తున్న వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నిందలు వేయడం శోచనీయమని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం మైదుకూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. వలంటీర్ల వ్యవస్థను దేశంలోని అన్ని రాష్ట్రాలు అభినందిస్తున్నాయని చెప్పారు. అలాంటి వ్యవస్థపై పవన్ కళ్యాణ్ తెలివి తక్కువ తనంతో నిందలు వేస్తున్నారని విమర్శించారు.

రెడ్ జోన్‌లో వలంటీర్ సేవలు

ప్రొద్దుటూరులోని శ్రీనివాసనగర్‌లో 2020 ఏప్రిల్ నెలలో జిల్లాలోనే తొలి కరోనా కేసు నమోదైంది. దీంతో శ్రీనివాసనగర్ పేరు మార్మోగింది. ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని రెడ్ జోన్‌గా ప్రకటించి రాకపోకలకు ఆంక్షలు విధించింది. ముఖ్యంగా 16వ సచివాలయం పరిధిలోని 13వ క్లస్టర్‌లో సగానికి పైగా కేసులు నమోదయ్యాయి. ఆ సమయంలో అక్కడి వలంటీర్ పర్వీన్ ధైర్యంగా తిరుగుతూ జనాలకు వైద్య పరీక్షలు చేయించింది. పేదల పరిస్థితిని చూసి ఒక నెల వేతనంతో కూరగాయలను కొనుగోలు చేసి ఇవ్వడం విశేషం. - ప్రొద్దుటూరు



కరోనా సమయంలో కూరగాయలను అందిస్తున్న వలంటీర్ పర్వీన్ (ఫైల్)

చుట్టుపక్కల వారు సైతం దగ్గరికి రాలేదు



కోవిడ్ సమయంలో శ్రీనివాసనగర్‌కు బయటి వ్యక్తులు రావడానికి సాహసించలేదు. నాకూ కోవిడ్ సోకింది. నా బంధువులతోపాటు చుట్టుపక్కల వారు మా ఇంటి పరిసరాలకు రావాలంటే భయపడేవారు. వలంటీర్ పర్వీన్ ఇంటికి వచ్చి సేవలు అందించేది. నేను ఇలా బతికి ఉన్నానంటే కారణం కరోనాలో వలంటీర్ అందించిన సేవలే. - జమాల్ బాషా, హమాలి, ప్రొద్దుటూరు.

మనసున్న వలంటీర్ మహేష్



కడప ఎన్‌జీఓ కాలనీ పరిధిలోని 9/2 సచివాలయం పరిధిలో వార్డు వలంటీర్ మహేష్ ఇక్కడి ప్రాంత ప్రజలకు విశేష సేవలు అందించాడు. ఇంటింటికి తిరిగి మాస్కులు, కూరగాయలు, టాబ్లెట్‌లు అందించడంతో పాటు, కోవిడ్ సోకిన వారి వివరాలను సచివాలయ సిబ్బందికి సమాచారం అందించి వారికి చికిత్సలు అందేలా చూశాడు. అలాగే ఇళ్ల మంజూరులో అర్హులను గుర్తించి అధికారులకు సమాచారం అందించాడు. -వైవీయూ



విజయలక్ష్మికి మంజూరైన ఇల్లు (ఇన్‌సెట్‌లో) మహేష్, 9/2 సచివాలయ వార్డు వలంటీర్

ఇంటి చలువ వలంటీర్ పుణ్యమే..



ఇస్త్రీ చేసుకుని బతికే మేము అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. సమస్య తెలుసుకున్న వలంటీర్ మాకు అర్హత ఉందని గుర్తించి జగనన్న గృహనిర్మాణ పథకానికి దరఖాస్తు చేయించారు. దగ్గరుండి నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు వచ్చేలా చూడటంతో పాటు ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు సేవలందిస్తున్నారు. వలంటీర్ల సేవలు భేష్.- విజయలక్ష్మి, ఎన్‌జీఓ కాలనీ, కడప

న్యూస్‌రీల్

దరఖాస్తుల పరిశీలన

కడప సెవెన్‌రోడ్స్: కారుణ్య నియామకాల కింద జిల్లా పరిషత్‌లో ఉద్యోగాల కోసం 61 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల వీరిలో ఇద్దరికి అవకాశం కల్పించారు. ఇక మిగిలిన 59 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా లేవు. వాచ్‌మెన్ పోస్టులు 95, అటెండర్‌పోస్టులు 53 ఖాళీలు ఉన్నట్లు జెడ్పీ అధికారులు తెలిపారు. కాగా, కారుణ్య నియామకాల కోసం వచ్చిన దరఖాస్తులను బుధవారం జెడ్పీ కార్యాలయంలో సీఈఓ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పరిపాలన అధికారి రంగాచార్యులు, సీనియర్ స్టెనో శ్రీనివాసులురెడ్డి తదితరులతో కూడిన బృందం పరిశీలించింది.

కిలో టమాట రూ.100

కడప అగ్రికల్చర్: కడప రైతుబజార్‌లో బుధవారం టమాట ధర సెంచరీ కొట్టింది. గత కొద్ది రోజుల నుంచి టమాటాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ వచ్చింది. ధర చూసి వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. దీంతో ప్రభుత్వం కల్పించుకుని ఇతర ప్రాంతాల నుంచి టమాటాలను దిగుబడి చేసుకుని 50 శాతం సబ్సిడీతో వినియోగదారులకు అందిస్తోంది. మొన్నమొన్నటి వరకు రైతు బజార్‌లో కిలో రూ. 70, రూ.80 ఉన్న టమాట ధర గురువారం రోజు కిలో రూ. 100 చేరింది.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా కోర్టు పరిధిలో పలు రకాల ఫర్నిచర్ సరఫరాతో పాటు ఇన్‌స్టలేషన్ చేసేందుకు ఆసక్తిగల సరఫరాదారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం 'డిస్ట్రిక్ట్స్.ఈ-కోర్ట్స్.జీఓవీ.ఇన్/కడప' వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. ఫోన్ ద్వారా 08562-254963 నంబరులో సంప్రదించాలన్నారు.

31లోపు దరఖాస్తు చేసుకోండి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో చేరేందుకు 2వ విడత అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ కన్వీనర్/ప్రధానాచార్యులు జ్ఞానకుమార్ తెలిపారు. 10వ తరగతి అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 31లోపు iti.ap.gov.in అనే వెబ్ సైట్ ద్వారా తమ వివరాలను పొందుపరిచి తాము చేరదలచిన ఐటీఐల పేర్లు నమోదు చేసి తమ అప్లికేషన్‌ను రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్టర్ చేసుకున్న అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవాలని చెప్పారు. అభ్యర్థులు తమ విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫోటో, ఆధార్, కుల ధృవీకరణపత్రం, మెయిల్ ఐడి, ఫోన్ నెంబర్ తీసుకుని తమ దగ్గరలోని ఏ ప్రభుత్వ ఐటీఐనైన సంప్రదించి తమ అప్లికేషన్ పంపవచ్చని వివరించారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

సీఎండీ సంతోషరావు

కడప కార్పొరేషన్ : వినియోగదారుల మన్ననలు చూరగొనేలా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పనిచేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ కె. సంతోషరావు అన్నారు. బుధవారం స్థానిక ఐఎంఏ హాలులో కడప డివిజన్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే అద్భుత అవకాశం మనకు లభించిందని, విద్యుత్ సంస్థ తరుపున మనం వారికి చేయాల్సిన సేవలను సకాలంలో అందించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించి, ముందస్తు మరమ్మతులు చేయాలని, అంతరాయాలను అరికట్టి నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. విద్యుత్ సేవలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయకపోతే సంబంధిత అధికారులు వినియోగదారులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడకుండా చూడాలన్నారు. రైతులకు కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసులు విడుదల చేయడంలో జాప్యం చేయవద్దన్నారు. డీబీటీ

పథకం నిర్వహించడానికి రైతుల నుంచి బ్యాంకు వివరాలను వెంటనే తీసుకోవాలనానరు. జగనన్న కాలనీల్లో విద్యుత్ సర్వీసులు యుద్ధ ప్రాతిపదికన విడుదల చేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటూ, ప్రమాదాల నివారణే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కడప డివిజన్ పరిధిలో అత్యధికంగా విద్యుత్ బకాయిలు పేరుకుపోయి ఉన్నాయని, వాటి వసూలుపై దృష్టి సారించాలన్నారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలన్నారు. అవసరమైన ప్రాంతంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. పట్టణాల్లో 12.5 మీటర్ల ఎత్తుండే స్తంభాలను ఏర్పాటు చేయాలని, వీలైనంత మేరకు రోడ్ క్రాసింగ్ లైన్లను ఏర్పాటు చేయవద్దని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీఎస్‌పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్లు ధర్మజ్ఞాని, గురవయ్య, ఓఎస్‌డీ శ్రీనివాసులు, ఎస్ఈ ఎస్. రమణ, అకౌంట్ ఆఫీసర్ మధు, కడప డివిజన్ ఈఈ ఎల్. నరసింహ ప్రసాద్, డీఈలు, ఏఈలు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ కె. సంతోషరావు

ఎస్టీయూ ప్రధాన కార్యదర్శిగా వెంకటసుబ్బయ్య



మైదుకూరు/కడప ఎడ్యుకేషన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శిగా మైదుకూరుకు చెందిన వై.వెంకటసుబ్బయ్య బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కడపలోని వీణా విజయరామరాజు ఎస్టీయూ భవన్‌లో జరిగిన జిల్లా ప్రధాన బాధ్యుల సమావేశంలో ఆయనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. మైదుకూరులోని సాయినాథపురం ఎంపీపీ స్కూల్‌లో పనిచేస్తున్న వెంకటసుబ్బయ్య, ప్రస్తుతం ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. వెంకటసుబ్బయ్య ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై జిల్లా, రీజియన్, మండల ప్రధాన బాధ్యులు, మైదుకూరు ఎస్టీయూ నాయకులు అభినందలు తెలిపారు.

అతి తక్కువ ఖర్చుతో పార్శల్ సర్వీస్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ద్వారా అతి తక్కువ ఖర్చుతో, తక్కువ వ్యవధిలో సరుకులను గమ్య స్థానాలకు సురక్షితంగా చేరవేస్తామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. అలాగే డోర్ డెలివరీ సౌకర్యం కూడా ఉందన్నారు. నగరాలు, పట్టణాల్లో 84 కేంద్రాలలో పది కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీ సౌకర్యం కలదన్నారు. వినియోగదారులు పార్శళ్లను త్వరితగతిన బుక్ చేసుకునేందుకు నగదు రహిత లావాదేవీల కోసం ఫోన్ పే సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. ఉత్సాహంగల నిరుద్యోగులు, వ్యాపారులు అథరైజ్డ్ పార్శల్ బుకింగ్ కేంద్రాల నిర్వహణపై ఆసక్తి గల వారు తమను సంప్రదించాలని సూచించారు. వివరాలకు కడప డీఎం (సెల్ నెంబరు 99592 25774), డీఎంఈ (7382869023), ఆర్ఎంఈ (99492 49717), ఏటీఎం కమర్షియల్ (995922 3209)ను సంప్రదించాలని కోరారు.

నేడు కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ రాక

పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, జేసీ, ఎస్పీ

మదనపల్లి: కేంద్ర జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ గురువారం అన్నమయ్యజిల్లా మదనపల్లెకు రానున్నారు. తిరుపతి ఎయిర్‌పోర్ట్ నుంచి మధ్యాహ్నం 1.20 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 2.00 గంటలకు మదనపల్లె బీటీ కళాశాల గ్రౌండ్స్‌లోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ ఆయనకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లుభవనాలశాఖ మంత్రి దాడిశెట్టిరాజా, ఎమ్మెల్యే నవాజ్‌బాషా, కలెక్టర్ గిరీషా పీఎస్., జేసీ ఫర్మాన్ అహ్మద్, ఎస్పీ గంగాధరరావు తదితరులు స్వాగతం పలకనున్నారు. అక్కడి నుంచి 2.15 నిమిషాలకు కేంద్రమంత్రి నక్కలదిన్నెలోని సత్సంగ్ ఫౌండేషన్‌కు చేరుకుంటారు. పద్మభూషణ్ ముంతాజ్‌అలీ(శ్రీఎం) ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన స్వాస్థ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభిస్తారు. సాయంత్రం 4.10 నిమిషాలకు తిరుపతి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని ప్రత్యేక విమానంలో నాగపూర్‌కు తిరుగు పయనం కానున్నారు. కేంద్రమంత్రి పర్యటించే ప్రాంతాలను ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో కలిసి కలెక్టర్ గిరీషా పీఎస్., జేసీ ఫర్మాన్ అహ్మద్, ఎస్పీ గంగాధరరావు, ఆర్డీఓ మురళీ తదితరులు బుధవారం పరిశీలించారు.



కేంద్రమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై ముంతాజ్‌అలీతో చర్చిస్తున్న కలెక్టర్,ఎస్పీ, ఎమ్మెల్యే

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం: జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

పెనగలూరు: ఆంధ్రప్రదేశ్‌లోని వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని జిల్లాపరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఈటమాపురంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వలంటరీ వ్యవస్థను కొంతమంది నాయకులు విమర్శించడం తగదన్నారు. రాష్ట్రంలో ఏ కుటుంబానికి ఏ అవసరముందో వలంటరీ వ్యవస్థ ప్రభుత్వానికి తెలియజేస్తుందన్నారు. సంక్షేమ పథకాలకు అర్హులుగా ఉన్న వారందరికీ ప్రభుత్వం నుంచి లబ్ధి పొందేందుకు జగనన్న సురక్ష పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పారిశ్రామికవేత్త బత్తిన పెద్దగుండాల్ రెడ్డి, పెంచలకోన ఆలయ ట్రస్టు చైర్మన్ తిరుపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, ఓబులవారిపల్లి ఎంపీపీ తిరుపాలు, జెడ్పీటీసీ లక్ష్మీనరసయ్య, రాజంపేట జెడ్పీటీసీ దాసరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట వరకే తిరుమల ఎక్స్‌ప్రెస్

కడప కోటిరెడ్డిసర్కిల్ : తిరుపతి రైల్వే జంక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల దృష్ట్యా కడప-విశాఖ-కడప మధ్య తిరుగుతున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రేణిగుంట మీదుగా విశాఖకు వెళుతుందని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ తెలిపారు. కడప-విశాఖపట్టణం (17487) రైలు ఈనెల 12వ తేదినుంచి ఆగస్టు 10వ తేది వరకు రేణిగుంట మీదుగా రాకపోకలు సాగిస్తుందన్నారు. అలాగే విశాఖపట్టణం-కడప (17488) మధ్య తిరిగే రైలు ఈనెల 11 నుంచి ఆగస్టు 10వ తేది వరకు తిరుపతికి వెళ్లకుండా రేణిగుంట మీదుగానే నడుస్తుందన్నారు. అలాగే తిరుపతి-హుబ్లీ-తిరుపతి (07657/58) రైలు ఆగస్టు 10వ తేది వరకు రేణిగుంట వరకే నడుస్తుందన్నారు. వీటితో పాటు తిరుపతికి వెళ్లాల్సిన మరి కొన్ని రైళ్లను రద్దు చేయగా, మరికొన్నింటిని దారి మళ్లించారని పేర్కొన్నారు.

అరచేతిలో పాఠం!



ఆల్ ఇన్ వన్ ఎస్ఎస్‌సీ 2024 యాప్

ఆయనో ఉపాధ్యాయుడు..
బడినే వేదికగా చేసుకుని కొత్త ఒరవడి సృష్టించాడు. తరగతి గదిలోనే కాదు అరచేతిలోనూ పాఠాలను ఆవిష్కరించాడు. ఆలోచనలు మంచివైతే ఫలితాలు ఉన్నతంగా ఉంటాయని చేతల్లో చూపించాడు. ఆయనే జిల్లాకు చెందిన గణిత ఉపాధ్యాయుడు కంభం వెంకటేశు. ఇదివరకు కొన్ని డిజిటల్ యాప్‌లను ఆవిష్కరించిన ఆయన తాజాగా పదో తరగతి విద్యార్థుల కోసం 'ఆల్ ఇన్ వన్ ఎస్ఎస్‌సీ -2024' పేరిట మరో యాప్‌ను తీసుకొచ్చాడు భళా అనిపించాడు.

- టెన్త్ విద్యార్థులకు నాణ్యమైన డిజిటల్ కంటెంట్
- ఆల్ ఇన్ వన్ ఎస్ఎస్‌సీ -2024 యాప్‌ను రూపొందించిన కంభం వెంకటేశ్వర్లు



ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లె గ్రామం కడప సింగరప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న కంభం వెంకటేశ్వర్లు మరో కొత్త యాప్ సృష్టించాడు. కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయుల సహకారంతో ఒక అండ్రాయిడ్ అప్లికేషన్ ''ఆల్ ఇన్ వన్ ఎస్ఎస్‌సీ-2024 యాప్'' రూపొందించారు. విద్యార్థులకు నాణ్యమైన డిజిటల్ కంటెంట్ అందించాలన్న ఉద్దేశంతో 'ఆల్ ఇన్ వన్ ఎస్ఎస్‌సీ-2024 యాప్' రూపొందించారు.

యాప్ విశేషాలు

గణితం, అంగ్లం, జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం, సోషియల్, హిందీలకు సంబంధించిన అన్ని పాఠాలకు సంబంధించి పీడీఎఫ్ మెటీరియల్ యాప్‌లో ఉంటుంది. గణితానికి సంబంధించి దాదాపు 150కిపైగా వీడియోలు, జీవశాస్త్రం 80, భౌతిక శాస్త్రం 70కిపైగా వీడియోలతో కలిపి మొత్తం 300పైగా వీడియోలు కలిగి ఉండడం విశేషం.

ఆన్‌లైన్ క్విజ్‌లు

యాప్‌లో దాదాపు 50కిపైగా క్విజ్‌లు ఉన్నాయి. ఇవి విద్యార్థులు వారంతట వారే మూల్యాంకనం చేసుకునేందుకు ఉపయోగపడుతాయి. వారి మార్కులను, ర్యాంక్, పర్సెంటేజ్‌ను తెలుసుకోవచ్చు.

మైండ్ మ్యాప్‌లు

గణితంలోని అన్ని పాఠాలకు మైండ్ మ్యాప్‌లు ఉన్నాయి. వీటి ద్వారా పాఠాలలోని ముఖ్యాంశాలను సులువుగా గుర్తించుకోవచ్చు. గణితంలో సీ, డీ గ్రేడ్ స్థాయిలలోని విద్యార్థులకు సులువుగా పాస్ అయ్యేలా ప్రత్యేక మెటీరియల్ ఉంచారు. జీవ శాస్త్రంలో మ్యానువల్, సోషల్‌లో మ్యాపింగ్ స్కిల్స్ కోసం ప్రత్యేక మెటీరియల్ పొందుపరిచారు.

ప్రత్యేక ఫీచర్ ఆస్క్ యువర్ క్వశ్చన్

ఈ ఫీచర్ ద్వారా విద్యార్థులు తమకు వచ్చిన సందేహాలను యాప్‌లోని కెమెరా ఉపయోగించుకొని నిపుణులకు ప్రశ్నలను పంపవచ్చు. నిపుణుల ద్వారా సమాధానాలు లభిస్తాయని ఉపాధ్యాయుడు కంభం వెంకటేశు తెలిపారు. నోటిఫికేషన్ ఫీచర్ ద్వారా విద్యార్థులకు ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ తెలుస్తాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు https:// telugumaths.weebly.com/ వెబ్ సైట్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు.

యాప్‌కు పలువురు ఉపాధ్యాయుల సహకారం

విద్యార్థులకు ఉపయోగపడే ఈ యాప్‌ను తయారు చేయడంలో పలువురు ఉపాధ్యాయులు సహకారం అందించారు. దొరసానిపల్లె జెడ్పీ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు పాలగిరి ప్రసాద్, హిందీ ఉపాధ్యాయుడు యామవరం హుస్సేన్‌బాషా, కర్నూలు జిల్లాకు చెందిన గణిత ఉపాధ్యాయుడు హరగోపాల్, చీరాలకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు గాలి శ్రీకర్, వీరబల్లికి చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు బోగా వెంకటసుబ్బయ్య, బద్వేలుకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు దివంగత ఎలిచర్ల గజేంద్రనాథరెడ్డి, పాలసముద్రం ఉపాధ్యాయురాలు, జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె.మంజుల, బి.శివలక్ష్మి, కూనాటి సురేష్ ఇందుకు సహకారం అందించారు.

నేడు 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ'

కడప కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి నేడు 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఉదయం 11 నుంచి 12 గంటలలోపు 08562 -242457 నంబర్‌కు ఫోన్ చేసి, తమ సమస్యలను తెలిపి పరిష్కారాలు పొందవచ్చన్నారు.

అధ్యాపకుల రిటైర్‌మెంట్ వయసు పెంపు

వైవీయూ : రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేసే రెగ్యులర్ అధ్యాపకుల పదవీ విరమణ వయసును 62 నుంచి 65 సంవత్సరాలకు పెంచడంతో అధ్యాపకవర్గంలో సంతోషం నెలకొంది. బుధవారం నిర్వహించిన ఏపీ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పదవీ విరమణ వయసు పెంపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో అధ్యాపకుల సేవలను కాంట్రాక్ట్ పద్ధతిలో వినియోగించునేలా ఉత్తర్వులు రానున్నట్లు ఉన్నతవిద్యావర్గాల సమాచారం. పరిపాలన పరమైన విధులు కాకుండా, అకడమిక్ అంశాల పట్ల వీరు దృష్టిసారించేలా, 2022 జనవరి 1 నుంచి పదవీవిరమణ చేసిన వారందరికి ప్రయోజనం నెరవేరేలా ఉత్తర్వులు రానున్నట్లు విశ్వవిద్యాలయ వర్గాలు తెలిపాయి. కాగా 2022 జనవరి 1 నుంచి ఇప్పటి వరకు విశ్వవిద్యాలయంలో ఆరుగురు అధ్యాపకులు (డా. గోవర్ధన్‌నాయుడు, ఆచార్య టి. వాసంతి, ఆచార్య కె.వలీపాషా, డా. నాజినీస్ పర్వీన్, ఆచార్య ఎం. మల్లికార్జునరెడ్డి) పదవీ విరమణ చేశారు. వీరితో పాటు ఈ యేడాదిలో మరో ముగ్గురు అధ్యాపకులు పదవీ విరమణ చేయాల్సి ఉండేది. తాజాగా కేబినెట్ పదవీవిరమణ వయసును పెంచడంతో వీరంతా తిరిగి విధుల్లో చేరి బోధన కొనసాగించే అవకాశం లభించినట్లయింది.

స్థలాల వ్యాపారి హత్య కేసులో ఐదుగురు అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : స్థలాల వ్యాపారి గుమ్మళ్ల రామమోహన్‌రెడ్డి హత్య కేసులో ఐదుగురిని త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఐదు సెంట్ల స్థలం విషయమై పంచాయితీకి పిలిపించి రామాంజనేయరెడ్డి కార్యాలయంలో రామమోహన్‌రెడ్డిపై దాడి చేయడంతో అతను అస్వస్థతకు గురై మంగళవారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై ప్రొద్దుటూరుకు చెందిన మేకల జగన్‌మోహన్‌రెడ్డితో పాటు కొందరిపై త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రమేయమున్న మేకల జగన్‌మోహన్‌రెడ్డితో పాటు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి సోదరుడు రామాంజనేయరెడ్డి, పోట్లదుర్తికి చెందిన సాయికుమార్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి,కార్తీక్‌రెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆధిక్యంలో నెల్లూరు, చిత్తూరు జట్లు



తలపడుతున్న కడప, నెల్లూరు జట్లు (ఇన్‌సెట్) 129 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మన్ షావుల్ హమీద్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో రెండోరోజు మ్యాచ్‌లో నెల్లూరు, చిత్తూరు జట్లు ఆధిక్యంలో కొనసాగుతున్నాయి. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 56 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు రెండోరోజు బుధవారం 101 ఓవర్లలో 366 పరుగుల వద్ద ఆలౌటైంది. జట్టులోని ఎస్. షావుల్‌హమీద్ 129 పరుగులు, మన్విత్‌రెడ్డి 83 పరుగులు చేశారు. కడప బౌలర్లు మహమ్మద్ అస్లాం 3, సాయి ఆర్థిత్‌రెడ్డి 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 4 ఓవర్లు నిర్వహించగా, ఒక్క పరుగు లభించలేదు. ఓపెనర్లు ఇద్దరూ బరిలో ఉన్నారు. దీంతో రెండోరోజు ఆట ముగిసింది.

కేఓఆర్ఎం మైదానంలో చిత్తూరు, అనంతపురం మ్యాచ్‌లో రెండోరోజు బుధవారం 130 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన అనంతపురం జట్టు 56.3 ఓవర్లలో 253 పరుగులు చేసి ఆలౌటైంది. జట్టులోని ప్రశాంత్ 79 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ మహమ్మద్ ఇర్ఫాన్ 3, బాలాజీ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 62.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. జట్టులోని లోహిత్ లక్ష్మినారాయణ 54 పరుగులు చేశాడు. అనంత బౌలర్లు ప్రదీప్‌రెడ్డి 3, లీలాసాయి 3 వికెట్లు తీశారు. దీంతో రెండోరోజు ఆట ముగిసింది.

పశుగ్రాస పథకాలను
సద్వినియోగం చేసుకోవాలి



గడ్డి ప్లాంట్ వద్ద రైతులకు పశుగ్రాసం గురించి వివరిస్తున్న జేడీ శారదమ్మ, పశువైద్యులు

మైదుకూరు : పాడి రైతులు ప్రభుత్వం అందించే పశుగ్రాస పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ శారదమ్మ అన్నారు. మైదుకూరులోని ప్రాంతీయ పశువైద్యశాలలో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్‌లో భాగంగా బుధవారం జాతీయ పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శారదమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీతో ఇచ్చే గడ్డి గింజలు, పశుగ్రాస విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకొని పశుగ్రాస కొరతను అధికమించాలని సూచించారు. జమ్మలమడుగు ఉపసంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు, మైదుకూరు ప్రాంతీయ పశువైద్యశాల ఇన్‌చార్జి ఏడీ డాక్టర్ గురివిరెడ్డి, మండల పశువైద్యాధికారి డాక్టర్ సుధాకర్, డాక్టర్ విజయకుమార్ తదితరులు రైతులకు వివిధ రకాల పశుగ్రాసాల గురించి, పశువుల్లో శాస్త్రీయ పోషణ గురించి, జీవాలలో, పశువుల్లో వచ్చే వ్యాధులు, నివారణ చర్యల గురించి వివరించారు. అంతకుముందు మండల వెలుగు కార్యాలయంలో జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ శారదమ్మ మాట్లాడుతూ 2009 నుంచి 2011 వరకు ఎన్‌సీడీసీ పథకం ద్వారా ఇచ్చిన రుణాలను గొర్రెల పెంపకందారులు చెల్లించాల్సిందిగా సూచించారు. బకాయిలు చెల్లించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి



వల్లూరు మండలంలోని లేబాకలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ గణేష్ కుమార్

కమలాపురం : సచివాలయ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని కమలాపురం-2వ వార్డు సచివాలయంలో జరుగుతున్న జగనన్న సురక్ష క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. ఏ సమస్యపై ఎన్ని అర్జీలు వచ్చాయో? అడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖరు వరకు ఈ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, పుల్లారెడ్డి, తహసీల్దార్ సరస్వతి నగర కమీషనర్ రాజశేఖర్, సచివాలయ సిబ్బంది, అర్జీదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వల్లూరు : ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ పేర్కొన్నారు. వల్లూరు మండల పరిధిలోని లేబాక గ్రామ సచివాలయ ఆవరణలో బుదవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జేసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల సమస్యలను పరిష్కరించుకునే అవకాశం వుందని అన్నారు. మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, మండల స్పెషలాఫీసర్ రవీంద్రనాథరెడ్డి, ఎంపీడీవో జుబేద, తహశీల్దార్ శంకర్ రావు, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, ఏపీఎం శైలజ, మాజీ ఎంపీటీసీ రాజారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని కలమల్ల గ్రామంలోని 1వ గ్రామ సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ పాల్గొని ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏ నాగేశ్వరరావు, ఎంపిడిఓ భాగ్య లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ప్రాజెక్టు హెడ్ మదన్‌మోహన్, తదితరులు

చెన్నూరు : పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని.. భావి తరాలకు ఉపయోగపడేవిధంగా విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని నేషనల్ హైవే పీడీ గోవర్ధన్ పేర్కొన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్, నేషనల్ హైవేస్ వారి సహకారంతో బుధవారం చెన్నూరు పాత టోల్ ప్లాజా వద్ద హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ ఈ రోజు 1000 మొక్కలు నాటామని, ప్రతిరోజు 1000 మొక్కలు నాటేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఇన్‌చార్జి ఆర్ఈపీఎల్ విజయ్ భాస్కర, ఆపరేషన్ హెడ్ అరుణ్‌రాజ్, సైట్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, ఇండిపెండెంట్ ఇంజినీర్ ప్రసాద్, యంగ్ హార్టీకల్చర్ ఎక్స్‌పర్ట్ నిహారిక, టోల్ ప్లాజా మేనేజర్ చిరంజీవి, సీడ్ బ్యాక్ ప్రాజెక్టు మేనేజర్ కొండల్రావు, హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు, నేషనల్ హైవే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సహకార రంగం బలోపేతానికి ప్రభుత్వం చర్యలు



మాట్లాడుతున్న డీసీఓ సుభాషిణి

కడప అగ్రికల్చర్ : సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని డిస్ట్రిక్ కోఆపరేటివ్ ఆఫీసర్(డీసీఓ) సుభాషిణి పేర్కొన్నారు. బుధవారం కడప కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని డీసీఓ కార్యాలయం సమావేశ మందిరంలో నాబార్డు వారి సహకారంతో రైతు ఉత్పాదక సంస్థల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీఓ సుభాషిణి మాట్లాడుతూ ఈ విషయమై గత నెల సహకార మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి డీసీఎంఎస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి కానీ, రైతు ఉత్పాదక సంస్థల(ఎఫ్‌పీఓ)వద్ద నుంచికానీ డీసీఎంఎస్ వారు ఉత్పత్తులు కొనుగోలు చేసి రైతుకు గిట్టుబాటు ధర రావడానికి సహాయం చేయాలని సూచించారన్నారు. అందుకోసం డీసీఎంఎస్ కృషి చేయాలని చెప్పారన్నారు. అందులో భాగంగా ప్రతి జిల్లాలో ఎఫ్‌పీఓ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారన్నారు. ఆ సూచనల మేరకే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తులు కొనుగోలు దారునికి అందజేయడం ద్వారా వాటికి అధిక ధర వచ్చేందుకు ఎఫ్‌పీఓస్ ప్రముఖ పాత్ర వహించాలన్నారు. నాబార్డు డీడీఓ విజయవిహారి, డీసీఎంఎస్ మేనేజర్ ఖాదర్‌వల్లి, ఉద్యానశాఖ జిల్లా టెక్నికల్ అధికారి జ్యోతిర్మయ్ మాట్లాడారు.

కారు,లారీ ఢీ

నలుగురు చిన్నారులు సహా ఏడుగురికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన నాగరాజు, శోభ



గాయపడిన ఆశ, చిన్నారులు

బి.కొత్తకోట : బోయకొండ అమ్మవారి దర్శనం చేసుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న కుటుంబం ప్రయాణిస్తున్న కారుకు త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. ముగ్గురు తీవ్రంగా, నలుగురు స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. కారును లారీ ఢీకొన్న సంఘటన బుధవారం సాయంత్రం బి.కొత్తకోట మండలం కోటిరెడ్డిగారిపల్లె వద్ద జరిగింది. బాధితులు, ఎస్ఐ రామమోహన్ కథనం మేరకు వివరాలు.. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు కేఆర్‌పురానికి చెందిన నాగరాజు (65) బోయకొండ గంగమ్మను దర్శించుకోవడం కోసం బుధవారం కారులో బయలుదేరాడు. కర్ణాటక చేలూరులో ఉంటున్న రెండోకుమార్తె ఆశ (24), ఆమె పిల్లలను, అక్కడినుంచి ములకలచెరువు మండలం సోంపల్లె పంచాయతీ తంబాళ్లపల్లెలో ఉంటున్న మొదటి కుమార్తె శోభ(26), ఆమె పిల్లలను తీసుకుని కారులో బోయకొండకు వెళ్లారు. అక్కడ అమ్మవారి దర్శనం అయ్యాక కేఆర్‌పురం వెళ్లాల్సిన నాగరాజు..మొదట తంబాళ్లపల్లె, తర్వాత చేలూరుల్లో కుమార్తెలను వదిలి వెళ్దామని కారులో తిరుగుప్రయాణమయ్యారు. జాతీయ రహదారిపై మండలంలోని శీలం వారిపల్లె పంచాయతీ కోటిరెడ్డిగారిపల్లె వద్దకు రాగానే పెనుగొండ నుంచి చెన్నై వెళ్తున్న లారీ.. కారును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నాగరాజు (65), ఇతని కుమార్తెలు శోభ (26), ఆశ (24)లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరి పిల్లలు రక్షిత (6), గిరిజ (4), జితేంద్ర (6), అనిల్ (13)లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి వెళ్లాలని వైద్యులు సూచించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ రామమోహన్ పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



ప్రొద్దుటూరు: మాట్లాడుతున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి

ప్రొద్దుటూరు/ఎర్రగుంట్ల,వేంపల్లె : నిబంధనలను ఉల్లంఘిస్తే చౌకదుకాణాల డీలర్లు, ఎండీయూలపైన చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో బుధవారం చౌకదుకాణాల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, ఐసీడీఎస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరకే నిత్యావసర వస్తువులను అందించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కందిపప్పు కిలో ధర రూ.67, అరకేజి చెక్కర ప్యాకెట్ రూ.17.50 తీసుకోవాలని, కొంత మంది డీలర్లు చిల్లర లేదని కంది పప్పుకు రూ.70, చెక్కరకు రూ.20 తీసుకుంటారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. బియ్యం కొనడం చట్ట విరద్ధమైన చర్య అని తెలిపారు. త్వరలో ఎండీయూ వాహనాలకు కూడా జీపీఎస్ ఏర్పాటు చేస్తామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏదైనా పనిమీద వెళ్లాలనుకుంటే క్యాజువల్ లీవ్ పెట్టి వెళ్లవచ్చునని, అటెండెన్స్ రిజిస్టర్‌లో ధర్నాకు వెళుతున్నామని రాస్తే ఎలా అని ఆయన ప్రశ్నించారు.

తూకాలు సక్రమంగా ఇవ్వడం లేదు

గోడౌన్‌లో సక్రమంగా తూకాలు ఇవ్వడం లేదని డీలర్లు నేరుగా చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.వెంటనే ఆయన డీఎం అర్జున్ రావును పిలిపించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్ఓ రవిశంకర్‌రెడ్డి, తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి పాల్గొన్నారు. అనంతరం ఆయన కొర్రపాడు రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సీమంతం , అన్నప్రాస కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

- ఎర్రగుంట్ల పట్టణంలోని నడివూరులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏపీ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనికీ చేశారు. కేంద్రంలోని చిన్నారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.అనంతరం పోట్లదుర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు.
- విద్యార్థులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదవాలని చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలోని ఎస్సీ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం, గురుకుల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ హరిత, ఎస్సీ హాస్టల్ టీచర్ సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

31న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అరుణాచల గిరి ప్రదక్షిణ నిమిత్తం ఈనెల 31వ తేదిన తిరువణ్ణామలైకు ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కడప, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల డిపోల నుంచి బస్సులు తిరుగుతాయన్నారు. కడప డిపో నుంచి రాత్రి 9, 9.30 గంటలకు సూపర్ లగ్జరీ (సర్వీస్ నం.6001/02)బస్సులు నడుస్తాయని, అందులో రూ. 1072 చార్జీగా నిర్ణయించినట్లు చెప్పారు. బద్వేలు నుంచి సాయంత్రం 5.30, 6 గంటగలకు సూపర్ లగ్జరీ (9569, 60009)బస్సులు తిరుగుతాయని, అందులో రూ. 1566, రూ. 1475 చార్జీగా ఉంటుందన్నారు. మైదుకూరు నుంచి సాయంత్రం 6.30 గంటలకు సూపర్ లగ్జరీ (96786) బస్సులో చార్జి రూ. 1432 ఉంటుందని తెలిపారు.ప్రొద్దుటూరు డిపో నుంచి ఇంద్ర ఏసీ సర్వీసు (9949) సర్వీసు మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరుతుందని, ఇందులో చార్జి రూ. 1635, అదే సమయంలో సూపర్ లగ్జరీ (9954)లో చార్జి రూ. 1273గా ఉందన్నారు. జమ్మలమడుగు నుంచి సాయంత్రం 5 గంటలకు సూపర్‌లగ్జరీ (98398) బస్సు బయలుదేరుతుందని, ఇందులో చార్జి రూ. 1352 గా నిర్ణయించారన్నారు. పులివెందుల నుంచి ఉదయం 8 గంటలకు సూపర్ లగ్జరీ (59900) బస్సు బయలుదేరుతుందుని, ఇందులో చార్జి రూ. 1242గా నిర్ణయించారని తెలియజేశారు.ఇతర వివరాలకు ఆయా డిపో మేనేజర్లను సంప్రదించాలని కోరారు.

బాధితుడికి చెక్కు అందజేత



చెక్కు ఇస్తున్న పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 9వ తేదీన పులివెందుల పర్యటన సందర్భంగా హెలీప్యాడ్ వద్ద ముఖ్యమంత్రిని కొంత మంది కలిసి ఆదుకోవాలని అభ్యర్థించారు. వీరిలో అనారోగ్య సమస్యలు, సదరం సమస్యలు వికలాంగులకు సంబంధించిన ట్రైసైకిళ్లు పంపిణీ చేయాలని వేడుకున్నారు. ఆ మేరకు అర్హులైన వారికి న్యాయం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. వారికి సంబంధించిన అర్జీలను పరిశీలించిన కలెక్టర్ విజయరామరాజు మొత్తం 8 మందికి చికిత్సలకు, ఇతర సమస్యలకు సంబంధించి ప్రభుత్వం నుంచి రూ. 6 లక్షలు విడుదల చేశారు. ఈ మేరకు బాధితులకు పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి పాడా కార్యాలయంలో బుధవారం చెక్కులను పంపిణీ చేశారు. బాధితుల్లో ఒకరిని బర్డ్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. మిగిలిన కొంత మందికి సదరం పత్రాలు, శిబిరాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

నిందితుల కోసం ప్రత్యేక బృందాలు



హత్యాస్థలంలో పరిశీలిస్తున్న తాలూకా సీఐ సత్యనారాయణ, పోలీసులు

మదనపల్లె : మండలంలోని బోడుమల్లుదిన్నెలో హత్యకు గురైన టమాటా రైతు నారెం రాజశేఖర్ రెడ్డి కేసుకు సంబంధించి ఘటనాస్థలంలో బుధవారం డాగ్‌స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలు సేకరించారు. కాగా హత్యాస్థలాన్ని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, డీఎస్పీ కేశప్ప, తాలూకా సీఐ సత్యనారాయణ పరిశీలించారు. వేలిముద్ర నిపుణులు ఆధారాలను సేకరించారు. మృతదేహానికి స్థానిక జిల్లా ఆస్పత్రిలో శవపంచనామా నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. అనంతరం డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ.. హత్యకు గల కారణాలను విచారిస్తున్నామని, అందులో భాగంగా హత్య జరగడానికి ముందురోజు జరిగిన విషయాలను కుటుంబసభ్యుల నుంచి తెలుసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితుల గాలింపునకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశామన్నారు. హత్యఘటనలో ఎందరు పాల్గొన్నారన్న అంశంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో క్రీడాకారులకు పతకాలు



క్రీడాకారులతో ప్రత్యేకాధికారి జగన్నాథరెడ్డి

కడప స్పోర్ట్స్ : గుంటూరు జిల్లా పల్నాడులో ఈనెల 8,9 తేదీల్లో నిర్వహించిన 7వ సబ్‌జూనియర్, జూనియర్ అంతర్ జిల్లాల అక్వాటిక్ చాంపియన్‌షిప్-23లో కడప డా. వైఎస్ఆర్ క్రీడాపాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. పాఠశాలకు చెందిన 13 మంది క్రీడాకారులు గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 విభాగాల్లో సత్తాచాటి 3 స్వర్ణాలు, 6 రజతాలు, 14 కాంస్య పతకాలతో మొత్తం 23 పతకాలు సాధించారు.విద్యార్థులకు క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి కె. జగన్నాథరెడ్డి అభినందనలు తెలిపారు. స్విమ్మింగ్ శిక్షకుడు రాజేంద్రను, క్రీడాకారులను ఆయన అభినందించారు.

పతకాలు సాధించిన వారు..

వై. రామకృష్ణ (కాంస్యం), వి. హేమలత (1 స్వర్ణం, 2 క్యాంస్యపతకాలు), ఎ. దినేష్ (1రజతం, 1 కాంస్యం), డి. దేవి (1స్వర్ణం, 1రజతం, 1కాంస్యం), బి. యశ్వంత్ (1స్వర్ణం, 1కాంస్యం), బి.నాగవర్ధన్ (2 రజతాలు, 1కాంస్యం), ఎల్.కార్తికేయదేవరాయల్ (4కాంస్యపతకాలు), వి.జ్ఞానఅఖిలేష్ (2రజతాలు, 1కాంస్యం), టి.షణ్ముఖ్ వెంకటశ్రీసాయి (కాంస్యం).

అడవి కుక్కల దాడిలో పొడదుప్పి మృతి



మృతిచెందిన పొడదుప్పి

బద్వేలు అర్బన్ : పట్టణానికి సమీపంలోని సి.కొత్తపల్లె బ్లాక్ అటవీ ప్రాంతంలో బుధవారం అడవి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన ఓ పొడదుప్పి మృతిచెందింది. అడవి కుక్కలు దాడి చేయడంతో గాయాలపాలైన పొడదుప్పి పట్టణంలోని శివానగర్ సమీపంలోని ముళ్ళపొదల్లో తలదాచుకుంది. గమనించిన స్థానికులు, మహిళా సంరక్షణ కార్యదర్శి వెంకటసుబ్బమ్మ అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. ఎఫ్ఆర్ఓ వెంకటశేషయ్య సిబ్బందితో అక్కడికి చేరుకుని దుప్పిని చేరదీసి చికిత్స నిమిత్తం చిన్నకేశంపల్లె పశువైద్యశాలకు తరలించారు. అక్కడ చేర్పించిన కొద్దిసేపటికే మృతిచెందింది. అనంతరం పశువైద్యాధికారి డాక్టర్ పవన్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం పంచాయతీదారుల సమక్షంలో పొడదుప్పిని ఖననం చేశారు. కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ ఖాజావలి, ఎఫ్‌బీఓ సువర్ణకుమార్, ఏబీఓ కాంతిప్రసన్నలు పాల్గొన్నారు.